

# హారం

శ్రీ రావు వెంకట
రంగనాయకులు.

పర్వతాలోయ సమీపమున ఒక గ్రామంవుంది. అక్కడ ఒక యువతీ ఒక యువకుడూ నివసిస్తున్నారు. యువతిపేరు మనియా. యువకునిపేరు లక్ష్మణ్. వయస్సులో లక్ష్మణ్ 'మనియా'కంటె చిన్నవాడు.

వారికి బయట ప్రపంచంతో యేమీ సంబంధం లేదు. నదిఒడ్డున, వృక్షచ్ఛాయల్లో, చల్లనిగాలిలో, పూల సుగంధంలో వారి సరళహృదయం ఆనందంతో ఉప్పొంగుతోంది. వారిముఖం రంగు నలుపు. ఆకారం కూడా అంత అందమైనది కాదు. కాని వారిదేహములు బలమైనవి. యవ్వనము తొణుకాడుతూవున్నవి.

ఉదయాన్నే లేచి వారిద్దరూ, తమ కుటీరముల నుండి బయలుదేరి పర్వతాలువైపుకు వెళ్తుంటారు. లక్ష్మణ్ అడవిలోంచి ఏదోపక్షో, లేక అడవిపందో చంపి తెస్తాడు. ఆ వేళైనా రోజూ దొరకదు. అప్పుడు వారిద్దరూ కలిసి ఏదోవొక చెట్టునీడను కూర్చుంటారు. లక్ష్మణ్ పిల్లనగ్రోవితో రాగం విసురుతుంటాడు.

* * *

ఈ విధంగా యేకాంతంగా వారి దినాలు గడచిపోతున్నాయి. ఆ రోజున వారు నదిఒడ్డున కూర్చున్నారు. సూర్యుడస్తమిస్తున్నాడు. నది అవతల ఒడ్డున కొంచెందూరంగా మేఘాలమధ్య కొంగగుంపు ఎగురుతూ పోతూవుంది. 'మనియా' ఆశోభ చూస్తోంది. దగ్గరే లక్ష్మణ్ ధ్యానంతో రంగురాళ్లు ఏరుతున్నాడు.

మనియా:-లక్ష్మణ్! ఇక చాలించు.

లక్ష్మణ్ ఆమె దగ్గరకువచ్చి నిలబడ్డాడు. అతని అంగవస్త్రములో కుప్పలా రాళ్లున్నాయి. ఒకటి పసుపుపచ్చ, ఒకటి నీలం, మరొకటి మెరుపు. మనియా వాటిని చూచి కొన్ని రాళ్లు తీసిఅంది- 'వహవ్వా! వీటితో ఒక

మంచిహారం తయారు చేయవచ్చు.' ఆమె ఆనందంతో నవ్వింది.

సంధ్యాకాలానికి యింక యెంతో వేళలేదు. ఇద్దరూ ఊరివైపుకు మరలారు. వెళ్తూ, వెళ్తూ మనియా అకస్మాత్తుగా ఆగిపోయింది. ఆమె వెంటనే తన రెండు చేతుల్తో అతని చేయిని లాగింది. చకితుడై లక్ష్మణ్ మనియావైపు ప్రశ్నా సూచక దృష్టితో చూచాడు. మనియా ఎదుటవైపు వ్రేలు చూపింది.

ఎదుటనున్న అడవి వణకుతున్నట్టు లక్ష్మణ్ కనిపెట్టాడు. అక్కడ ఒక సింహం కూర్చునివుంది.

నిమిషంలో అతడు ధనువు యెక్కుపెట్టి రెండు కదములు ముందుకు వేశాడు. బాణంవేశాడు. సరిగా ఆక్షణములో అడవి రెండోవైపునుంచి కూడా ఎవనిదో అదృశ్యహస్తంతో విసిరిన ఒక బాణంవచ్చి సింహం దేహంలో గుచ్చుకొన్నది. రెండు వైపులనుంచీ గాయపడి ఆ సింహం చనిపోయింది.

అడవి చాటునుండి ఒక మనుష్యుడు బైటకు వచ్చాడు. లక్ష్మణ్ కూడా అక్కడకు పరుగెత్తుకు వెళ్లాడు. ఆ వచ్చే వానిని చూచి లక్ష్మణ్ —జాగ్రత! ఇది నావేటఅన్నాడు

అతడు తనకుడికాలు చచ్చిన సింహంమీదపెట్టి దృఢంగా యిలా అన్నాడు--ఇది నావేట నేను రెండు ఝాములనుంచి దీనివెనుక పరుగెత్తుతున్నాను.

లక్ష్మణ్—సింహందేహంమీద నాబాణం గుచ్చుకొన్నది.

అతడు—సింహం నెత్తిమీద నాబాణం గుచ్చుకొన్నది. ఆ బాణంవల్లనే ఈ సింహం చనిపోయింది.

ఇద్దరూ వాదోపవాదాలు జరుపుకుంటున్నారు. ఇంతలో మనియా అక్కడకు వచ్చింది. వీరిద్దరికీ తప్పక దెబ్బలాట జరుగుతుందని మనియా అనుకొన్నది. ఆమె అంది- 'చూడుడు, అదిగో ఒక పక్షి యెగురుతున్నది. ఆపక్షిని యెవడు చంపుతాడో ఆసింహం వాని దవుతుంది.'

ఇద్దరూ పైకిచూచారు. అది చిన్నపక్షి నెత్తిమీదనుంచి ఆడుతూ, ఎగురుతూ పోతూవున్నది. ఇద్దరూ ఒకమారుబాణం వేశారు. పక్షి బాణవేగంవల్ల పైకిపోయి తిరిగి క్షణంలో పల్టీకొట్టుతూ మనియా కాళ్లదగ్గరవచ్చి పడింది. పక్షి ఛాతీలో ఓబాణం గుచ్చుకుంది. ఆ బాణం యెవరిది? ఉత్సాహంతో మనియా వంగి బాణం చూడ నారంభించింది. కాదు- ఇది లక్ష్మణుని బాణం కాదు.

మనియా శిరమెత్తి చెప్పింది—లక్ష్మణ్ నీ బాణంవల్ల పక్షి చావలేదు. సింహం నీదికాదు.

లక్ష్మణ్ ఏమీ అనలేదు.

మనియా అతనితో యిలా అంది—నువ్వెడవు?

ఆ యువకుడు నది అవతల ఒడ్డున చీకటివైపు వ్రేలు చూపించి అన్నాడు-నేనా గ్రామంలో ఉంటున్నాను. నాపేరు కానూ

* * *

కానూ మనియాని వశం చేసుకొన్నాడు. కానూ యిప్పుడు ప్రతిదినమూ వస్తున్నాడు. మనియాతో షికారు పోతున్నాడు. వేటకు పోతున్నాడు. లక్ష్మణ్ ప్రభావం యిప్పుడులేదు. లక్ష్మణ్ మితభాషి. కానూ మాట్లాడుతుంటే తన్నవమానపరుపమాటలాడుతున్నట్టుగా గ్రహించి అతనితో యిష్టంగా ఉండడం మానివేశాడు. మనియాతో తిరగడానికి కూడా అతని కిప్పుడంత యిష్టంలేదు.

ఒకవేళ లక్ష్మణ్ షికారు వెళదాం అన్నా మనియా అంటుంది— కొంచెం తాళు, కానూని రానియ్యి, అందరమూ కలిసివెళదాం' అంటుది. కొంచెం సేపటికి కానూ వస్తాడు. కాని, అప్పుడు లక్ష్మణ్ కి వెళ్లడానికి మనస్కరించదు.

పర్వతంమీదికి వెళ్ళి ముగ్గురూ కూర్చుంటుంటారు. 'కానూ' మనియాకి ఎన్నో సంగతులు చెపుతుంటాడు. వేటసంగతులూ, దూరదేశపు సంగతులూ

తన ఐశ్వర్యపు సంగతులు. మనియా విస్మితనేత్రము లతో లక్ష్మణ్ వైపు చూస్తుంటుంది. లక్ష్మణ్ వింటు న్నావా, అని.

'ఆ, వింటున్నాను'-చాలసంక్షేపంగా జవాబిచ్చి లక్ష్మణ్ పర్వతంమీదనుంచి క్రిందికి చూస్తుంటాడు. క్రింద దృశ్యం చాలా అందంగా వుంది. మైదానంమీద పచ్చగడ్డి మొలిచి వుంది. పెద్ద పర్వతం, దాన్ని అంటు కొని ఒక దట్టమైన అడవి వుంది.

''పిల్లనగ్రోవి వాయించు లక్ష్మణ్''

లక్ష్మణ్ ఉలికిపడి మనియా ముఖాన్ని చూస్తూ మరొకమారు కానూ వైపుచూస్తూ చెపుతుంటాడు- 'పిల్లనగ్రోవిలేదు'

మనియా-'ఇంటివద్ద మరచిపోయి వచ్చావా?'

''లేదు''

''అయితే,''

''పిల్లనగ్రోవి విరిగిపోయింది.''

అతని యీ జవాబు విని కానూ, మానియా నవ్వుకున్నారు.

కానూ—పిల్లనగ్రోవి విరిగిపోతే మళ్ళీ చేసు కోలేవా లక్ష్మణ్?

''కాదు- కొత్త పిల్లనగ్రోవి కొత్త పాట పాడు తుంది.''

మనియా:-నువ్వు అలాగున్నావేం? నువ్వు మొట్టమొదట లాగు మాతో మాట్లాడడం లేదేం?

ఆ మాటకు జవాబివ్వక లక్ష్మణ్ నిలబడి అన్నాడు-'పొద్దుపోయింది ఇంకా ఇంటికిరారా.'

* * *

మూడు మాసాలు గడచిపోయాయి.

మనియాతో కానూ వివాహం జరుగబోతోంది. ఒకరోజున కానూ, మనియా షికారుకు బయలు దేరారు. అట్టే దూరం వెళ్ళలేదు.

కానూ:-లక్ష్మణ్ యెక్కడకు పోయాడు? అత డిప్పుడిక్క డకు యెందుకు రావడంలేదు?

మనియా:-ఏమో! తెలియదు. అతడు చాలరోజుల నుంచి నా దగ్గరకు రావడంలేదు.

ఇంతలో దూరంనుంచి వొక పాట వినిపించింది.

మనియా:-అదిగో లక్ష్మణ్ వస్తున్నాడు.

మనియానీ, కానూని చూచి లక్ష్మణ్ పాట ఆపివేశాడు. నెమ్మది నెమ్మదిగా అక్కడకువచ్చి నిల బడ్డాడు. మళ్లీ వొకమారు మనియానీ కానూని చూచాడు.

మనియా:-లక్ష్మణ్ ఏమిటి చూస్తూన్నావ్?

లక్ష్మణ్:-మిమ్మల్ని చూస్తున్నాను. నాకు నీవు యీవేళ చాల అందంగా కనబడుతున్నావు మనియా! కొంచెం సేసాగి లక్ష్మణ్ మళ్లీ అన్నాడు- మనియా, నన్ను విడిచిపెడ్తావా? నాకు విచారం వేస్తున్నది. నేను మరి యింకెవరితో షికారుకి పోను?

మనియా:-ఏం? నువ్వుకూడా పెళ్ళిచేసుకో.

లక్ష్మణ్:-ఎవరితో? ఎవరైనా నీలాగ నన్ను ప్రేమి స్తారా? చెప్పు మనియా, నన్ను మరచిపోవు గదా!

మనియా:-ఎందుకు మరచిపోతాను లక్ష్మణ్!

లక్ష్మణ్:-నీకోసం వొక వస్తువు తెచ్చాను మనియా పుచ్చుకుంటావా?

మనియా:-ఏమిటి పుచ్చుకునేది?

లక్ష్మణ్ చాల జాగ్రతగా అంగ వస్త్రములోంచి వొక రాళ్ళహారం పైకి తీశాడు. దీన్ని లక్ష్మణ్

పర్వతపు రాళ్లు ఏరి తయారు చేశాడు. కొన్ని రంగు రాళ్ళ ముక్కలికి కన్నాలు కొట్టి, ఈ హారం తయారు చేశాడు. హారాన్ని పైకితీసి లక్ష్మణ్ నీకీ రాళ్ళహారం యిష్టమేనా?' అన్నాడు.

"ఇది-యీహారం తీసుకో" అని ఆహారం ఆమె చేతికిచ్చాడు.

మనియా నవ్వింది. 'కానూతో యిప్పుడు నాకు వివాహం కాన్నున్నది. నాతో కానూ అన్నాడు నాకెన్నో వెండినగలు చేయిస్తానని. పర్వతపు రాళ్ళ హారం నేనేం చేసుకోను?"

లక్ష్మణ్ ముఖం మలినమైపోయింది.

"అయితే ఈ హారం తీసుకోవా మనియా?"

మనియా నవ్వింది- తీసుకో తగ్గవస్తువైతే తీసుకుందును. పట్టుకుపో లక్ష్మణ్, నీభార్య కియ్యి

కానూ కూడా నవ్వాడు.

లక్ష్మణ్ నెమ్మది నెమ్మదిగా వెళ్ళిపోతున్నాడు. మనియా లక్ష్మణుని పిలిచింది. అతడు జవాబివ్వలేదు. తిరిగి చూడనైనా లేదు. అతడు నదివొడ్డుననే అడవి వైపు వెళ్ళిపోయాడు. మునుపు మనియా, తానూ కూర్చున్న స్థలం అశ్రుపూరితమయింది. అతనికి జ్ఞాపకం వచ్చింది. ఇక్కడే మనియా దగ్గర కూర్చుని ఎన్నో పాటలు పాడాడు. ఇక్కడే కూర్చొని ఎన్నో మార్లు మురళి వాయించాడు. అతని సందిడిలో అడవంతా ప్రతి ధ్వనించేది. మనియా తనతో యెంతో తియ్యగా మాట్లాడేది. పాపం అతనిచ్చిన హారం మనియా పుచ్చుకోలేదు. నెమ్మదిగా పిల్లనగ్రోవి తీశాడు. అతని పిల్లనగ్రోవి విరిగిపోలేదు అతడు అబద్ధం చెప్పాడు.

ఆ సమయమున పుష్ప సుగధం విరజిమ్ముతోంది. ఆ సుగంధం పాత జ్ఞాపకాల్ని మళ్లీ రేకెత్తింపజేస్తోంది. చంద్రుడు ఉదయించినప్పుడు చద్రబింబాన్ని చూచి మనియా ఆనందంతో పాడుతుండేది. ఆమెవైపు చూచి వొక్క రాగం విసరుతుండేవాడు. నేడు హృదయవేదన ఈ పిల్లనగ్రోవి రంధ్రములనుండి పోయిందన్నట్టుగా అప్పుడు హాయిగా పాడేడు.

పిల్లనగ్రోవిని దూరంగా యిప్పుడు నదీ జలంలోనికి విసరివేశాడు. రెండు చేతుల్తోనూ హృదయాన్ని అణచిపెట్టి అలా కూర్చుండి పోయాడు.

—హిందీనుండి.

